క్లుప్తంగా

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం


తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. తదుపరి కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, అక్షింతలు, శేషవస్త్రాలు అందజేశారు.

కమ్యూనిటీ హాల్ ప్రారంభం


కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల

పెదగంట్యాడ: గ్రామాల అభివృద్ధిలో ఎన్టీపీసీ భాగస్వామి కావడం అభినందనీయమని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. జీవీఎంసీ 77వ వార్డు చిన్నపాలెం గ్రామంలో రూ.12లక్షల 60 వేలు ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులతో కొత్తగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎన్టీపీసీ వంటి సంస్థలు గ్రామాల అభివృద్ధికి పాటు పడాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, ఎన్టీపీసీ జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ సేహ్, కాకి అప్పలరెడ్డి (బాబు) తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని వినతి

పరవాడ: పారిశ్రామికవాడగా గుర్తింపు పొందిన పరవాడలో ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటుకు కృషి చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. పరవాడలో శుక్రవారం ఎమ్మెల్యే పంచకర్లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఫార్మాసిటీ, ఎన్టీపీసీ, ఇండస్ట్రియల్ పార్క్ పరిశ్రమలో సుమారు 40 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని వివరించారు. ఇక్కడ గతంలో ఏర్పాటు చేసిన డిస్పెన్సరీని తెరవకుండానే మూసివేశారన్నారు. కార్మికులకు ఎలాంటి అనారోగ్యమైనా పట్టణ ప్రాంతాల్లోని కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లి చికిత్స పొందాల్సి వస్తుందని ఫలితంగా ఆర్థిక భారం పడుతుందన్నారు. కార్మికుల ఇబ్బందులను గుర్తించి పరవాడలో ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.

వెంకన్నకు పంచామృతాభిషేకం



పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం చేశారు.

ఆదాయ పన్నుపై అవగాహన

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో శుక్రవారం ఆదాయ పన్నుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉక్కు పరిపాలన భవనంలోని ప్రధాన కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో పన్ను వర్తింపు, సడలింపునకు సంబంధించి ఆదాయ పన్ను శాఖలో ఇటీవల జరిగిన విశేషమైన మార్పులు, పరిణామాల గురించి ఐటీ డిప్యూటీ కమిషనర్ ఐ.మధుసూదనరావు, అసిస్టెంట్ కమిషనర్ పి.వి.శేషగిరిరావు వివరించారు. ఈ-ఫైలింగ్ చేయడం, డిజిటలైజేషన్ ప్రక్రియ, ముందుగా పూరించిన రిటర్న్‌లలో ప్రతిబింబించే ఆర్థిక సమాచారాన్ని సేకరించడం, డేటా సేకరణ, అప్పీళ్ల దాఖలు, ఆదాయ పన్ను కార్యాలయం సందర్శించకుండా తీసుకున్న వివిధ పద్ధతుల గురించి తెలిపారు. స్టీల్‌ప్లాంట్ సీజీఎం (ఫైనాన్స్) వి.శాంతకుమార్ మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు ఐటీ రిటర్న్‌లను సమర్పించడానికి ఆదాయ పన్ను అధికారులతో సంభాషించడానికి ఇది మంచి అవకాశమన్నారు.

వాన.. హైరానా

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- తీరంలో అలజడి


ముత్యాలమ్మపాలెం తీరంలో ఎగసిపడుతున్న కెరటాలు

పరవాడ: అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నియోజకవర్గ పరిధిలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం రోజంతా వర్షం కురుస్తూనే ఉంది. రోడ్లు, కాల్వలు పొంగిపొర్లాయి. జనజీవనం స్తంభించింది. కలెక్టర్ ఆదేశాలతో విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. ప్రస్తుత వర్షాలు ఖరీఫ్ వరి సాగుకు అనుకూలమని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.మరింతగా వర్షాలు కురిస్తే మాత్రం నారు మడులు నీటి ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.రోడ్ల పక్కన వ్యాపారాలు చేసుకునేవారు దిగాలు పడ్డారు.

తీరంలో అలజడి

మరోవైపు అల్పపీడనం ప్రభావంతో తీరంలో అలలు ఎగసిపడుతున్నాయి. భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకొని సముద్రంపై చేపల వేటకు వెళ్లొద్దని తహసీల్దారు గణపతిరావు హెచ్చరికలు జారీ చేశారు. మత్స్యకారులు తమ పడవలు,వలలు, ఇంజిన్లను సురక్షిత ప్రాంతాలకు తరలించుకొన్నారు.

కూలిన పూరిల్లు

మండలంలో శుక్రవారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి భర్నికం గ్రామంలో ఓ పూరిల్లు కూలిపోయింది. విషయం తెలిసిన వెంటనే తహసీల్దారు గణపతిరావు, వీఆర్వో శ్రీనివాసరావు ఘటన స్థలానికి వెళ్లి బాధితుడు వాసంశెట్టి మాణిక్యాలరావు కుటుంబాన్ని పాఠశాల భవనంలోకి తరలించారు. వారికి ప్రభుత్వం నుంచి 25 కిలోల బియ్యం, కందిపప్పు, చింతపండు, ఆయిల్, సాల్ట్ ప్యాకెట్లు అందజేశారు.

దంచికొట్టిన వర్షం

సబ్బవరం: తుపాను ప్రభావంతో శుక్రవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో మండల వాసులు తడిసి ముద్దయ్యారు. మండల కేంద్రం సబ్బవరంలో పలు చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ క్షేత్రాలు వర్షపు నీరు చేరడంతో కళకళలాడాయి.ఖరీఫ్ సీజన్‌కు రైతులు సిద్ధమవుతున్న తరుణంలో ఈ వర్షం ఊరటనిస్తోంది. పూత దశలో ఉన్న గంటి పంటకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. మండలంలో శుక్రవారం సాయంత్రం వరకూ 38.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. గురువారం 1.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా బుధవారం 4.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.


వాడచీపురుపల్లిలో కురుస్తున్న వర్షం


సబ్బవరంలోని వ్యవసాయ క్షేత్రాల్లో చేరిన వర్షపు నీరు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు


కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో రామ్మోహనరావు

సబ్బవరం: తుపాను ప్రభావం అధికంగా ఉండటంతో మండల, గ్రామ స్థాయి అధికారులు మండల కేంద్రంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో రామ్మోహన్‌రావు సూచించారు.స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమీక్షించారు. ముంపు,లోతట్టు ప్రాంతాలను ముందుగా గుర్తించి సమాచారం ఇవ్వాలని సూచించారు. వరద నీరు ప్రభావంతో రోగాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.శానిటేషన్ పనులు పక్కాగా చేపట్టాలని, తాగునీరు క్లోరినేషన్ చేయాలని సూచించారు. వరదనీరు గ్రామాల్లో నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.చికెన్, మటన్,చేపల దుకాణాల నిర్వాహకులకు నోటీసులు ఇవ్వాలని పాడైన మాంసాహారం విక్రయించేవారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

అప్రమత్తం : తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకట్, వీఆర్వోలతో కలిసి సమావేశం నిర్వహించారు.చెరువులు,వాగులు పొంగితే వెంటనే నష్ట నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలను అప్రమత్తం చేస్తూ వారికి అందుబాటులో ఉండాలని వీఆర్వోలు,ఇరిగేషన్ అధికారులకు సూచించారు.విద్యుత్ శాఖ అధికారులు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏవో షేక్ బాబూరావు,ఈవోఆర్డీ మహేష్,ఆర్ఐ వీరయ్య,కార్యదర్శులు మూర్తిబాబు,మహలక్ష్మినాయుడు,బ్రహ్మ,రాజేశ్వరరావు,మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దాం


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల


హాజరైన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు

ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పరవాడ: మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అంతా సమన్వయంతో పనిచేద్దామని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పంచకర్ల ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండే విధంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రహదారులు, డ్రైనేజీలు, తాగు నీటి వంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరమైన పనులకు ప్రతిపాదనలు, అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీపీ వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు ఎమ్మెల్యే పంచకర్లను సత్కరించారు. పంచాయతీరాజ్, రెవెన్యూ, ఇరిగేషన్, విద్య, ఆరోగ్యం, నీటి పారుదల, గృహ నిర్మాణం తదితర శాఖలపై సమీక్ష నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఎంపీడీవో కీర్తి స్పందన, తహసీల్దారు గణపతిరావు, వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు ఏర్పాట్లు పూర్తి

సింహాచలం: సింహగిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ప్రదక్షిణ ప్రారంభించే తొలి పావంచా వద్ద ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులు కొబ్బరి కాయలు కొట్టేందుకు వీలుగా అధిక సంఖ్యలో గద్దర్లు ఏర్పాటు చేయడంతో పాటు క్యూలైన్లు విభజించారు. భక్తుల అవసరాలకు తగ్గట్టుగా తాత్కాలిక మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పలు చోట్ల టెంట్లు వేశారు.


భక్తులు ప్రదక్షిణ ప్రారంభించే కొండదిగువ శ్రీవరాహ లక్ష్మీనసింహస్వామి తొలిపావంచా


తొలిపావంచా వద్ద కొబ్బరికాయలు కొట్టేందుకు ఏర్పాటు చేసిన ఇనుప గద్దర్లు


రెండో టోల్‌గేట్ వద్ద నమూనా ఆలయం


సింహగిరిపై భక్తుల దర్శనాల క్యూలు


గిరి ప్రదక్షిణ మార్గంలో ఏర్పాటు చేసిన స్టాల్స్

సీఎస్సార్ కార్యక్రమాలు విస్తృతం

జూనియర్ కళాశాలలో ల్యాబ్ ప్రారంభం


ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ల్యాబ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే పంచకర్ల, ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సిన్హా

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ సేవలను మరింత విస్తృతం చేయాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం సౌజన్యంతో రూ.19 లక్షలతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటిలెజెన్సీ, ఇన్నోవేషన్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఎన్టీపీసీ సేవలు అవసరమన్నారు. విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు వంటి సదుపాయాల కల్పనపై యాజమాన్యం దృష్టి సారించాలని సూచించారు. నిర్వాసిత గ్రామాల అభివృద్ధితో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు సంస్థ పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరావు, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, మాజీ ఎంపీపీలు పైల జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, మాధంశెట్టి నీలబాబు, కూటమి నేతలు పాల్గొన్నారు.

గిరి భక్తులకు ఇబ్బందులు రానీయొద్దు


జోరు వానలో గిరి ప్రదక్షిణ ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

అధికారులకు మేయర్ గొలగాని ఆదేశం

డాబాగార్డెన్స్: సింహగిరి ప్రదక్షిణ మార్గంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సింహాచలం తొలి పావంచా నుంచి అడవివరం, హనుమంతువాక, విశాలాక్షినగర్, అప్పుఘర్, ఇసుకతోట, సీతమ్మధార, మాధవధార, గోపాలపట్నం మీదుగా గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులు వెళ్లే మార్గాన్ని జీవీఎంసీ అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గిరి ప్రదక్షిణలో లక్షలాది మంది భక్తులు పాల్గొంటారని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పారిశుధ్యం, తాగునీరు, ఓఆర్ఎస్, ప్రథమ చికిత్స కేంద్రాలు, మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు వంటి ఏర్పాట్లపై మేయర్‌కు అదనపు కమిషనర్ విశ్వనాథన్ వివరించారు. పారిశుధ్య నిర్వహణకు అవసరమైన కార్మికులను అందుబాటులో ఉంచామన్నారు. తాత్కాలిక మరుగుదొడ్లు, లుంబినీ పార్కు సమీప బీచ్‌లో స్నానమాచరించే భక్తులు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు ఆయన చెప్పారు. బీచ్‌లో లైఫ్‌గార్డ్స్‌ను నియమించామన్నారు. స్వచ్ఛంద సంస్థలు, పలు సేవా సంఘాలకు స్టాళ్ల ఏర్పాటుకు స్థలాలు సూచించామని, ఆహార పదార్థాలు ప్లాస్టిక్‌లో కాకుండా ఆకులు, కాగితంతో తయారు చేసిన ప్లేట్లలో అందించాలని సూచించినట్టు ఆయన తెలిపారు. ప్రసాదం కౌంటర్ల వద్ద, నడక మార్గంలో ఎక్కడికక్కడ డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేశామని అదనపు కమిషనర్ మేయర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అధ్వానంగా ఎన్టీపీసీ రోడ్డు


అధ్వానంగా మారిన వెన్నలపాలెం-ఎన్టీపీసీ రోడ్డు

పరవాడ: వెన్నలపాలెం-ఎన్టీపీసీ రహదారి శిథిలావస్థకు చేరింది. దీంతో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ రహదారిలో నిత్యం వందల సంఖ్యలో ద్విచక్ర వాహనచోదకులు, ఉద్యోగులు, కార్మికులు రాకపోకలు సాగిస్తుంటారు. తంతడి రోడ్డు నుంచి రెండు కిలోమీటర్ల నిడివి కలిగిన వెన్నలపాలెం రహదారి గుంతల మయంగా మారింది. రోడ్డు అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరుకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కృషి చేయాలని గ్రామ ఉప సర్పంచ్ వెన్నల సన్యాసిరావు కోరారు.

‘ఉక్కు’లో పరిస్థితులు ఆందోళనకరం


దీక్ష శిబిరంలో పాల్గొన్న కార్మిక సంఘాల నేతలు

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారంలో నెలకొంటున్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వి.శ్రీనివాసరావు, గంగవరం గోపీ అన్నారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షల్లో 1254వ రోజు, శుక్రవారం వారు మాట్లాడారు. స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని ఏళ్ల నుంచి కోరుతున్నా ప్రభుత్వాలు పట్టనట్టు వ్యవహరిస్తుండడం బాధాకరమన్నారు. ఉత్పత్తి, ఉత్పాదకత, భద్రతా ప్రమాణాలు, ఆర్థిక పరిస్థితి, ముడిసరకు.. ఇలా అన్ని విధాలా ఉక్కును అష్ట దిగ్బంధనం చేసి ఊపిరాడకుండా చేయడం ద్వారా ‘ప్రైవేటీకరణ చేసేయండి’ అని కార్మికులు, స్థానికులే చెప్పే పరిస్థితికి తీసుకువెళ్తున్నారన్నారు. ప్రభుత్వాలు ఎన్ని కుట్రలు పన్నినా, ఎన్ని కుయుక్తులు వేసినా విశాఖ ఉక్కును కాపాడుకుంటామన్నారు. అవసరం వచ్చినప్పుడు రాష్ట్ర ప్రజలు తిరుగుబాటు చేస్తారని, అది ఎవరికీ మంచిది కాదన్నారు. ఎన్డీఏ భాగస్వామ్య పార్టీలైన టీడీపీ, జనసేనలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో ఎఫ్ఎండీ, ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్, సీఎంఈ, వీఎస్‌జీహెచ్, ప్లాంట్ డిజైన్ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. దీక్షా శిబిరంలో పి.రామకృష్ణరాజు, ఎం.ఎస్.రావు, పీజీకే రాజు, మధు, మోహన్, బి.వి.రమణ, గోపాల్, చిన్నయ్య పాల్గొన్నారు.

స్టీల్ కార్మికులకు తక్షణం వేతనం చెల్లించాలి

ఉక్కునగరం: స్టీల్ కార్మికులకు తక్షణం వేతనాలు చెల్లించాలని స్టీల్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని నెలలుగా స్టీల్ కార్మికులకు వేతనాలు చెల్లించడంలో యాజమాన్యం దుర్మార్గమైన వైఖరి అవలంభిస్తోందన్నారు. జీతాల చెల్లింపులో యాజమాన్యం కావాలనే జాప్యం చేస్తోందన్నారు. యాజమాన్యం వైఖరిని ఉక్కు మంత్రి ఎదుట అన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా తప్పుపడితే సగం జీతం చెల్లించిందని గుర్తు చేశారు. వెంటనే సగం జీతాన్ని చెల్లించకుంటే తీవ్ర పరిణామాలు ఎదురోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వై.టి. దాస్, పి. శ్రీనివాసరాజు, బి. అప్పారావు, గంగాధర్, టి.వి.కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు ఉరితాడు వంటి చట్టాలను రద్దు చేయాలి



సదస్సులో మాట్లాడుతున్న ముజాఫర్

డాబాగార్డెన్స్ : డ్రైవర్లకు ఉరితాడు వంటి చట్టాలను రద్దు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐఆర్‌టీడబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజాఫర్, ఆటో రిక్షా కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కె. సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోడ్డు రవాణా డ్రైవర్లకు వర్తించేలా ఏర్పాటు చేసిన మోటార్ ట్రాన్స్‌పోర్టు సవరణ చట్టం 2019, జీవో 21ని రద్దు చేయాలని, పెట్రోల్, డీజిల్‌లో పన్ను మినహాయింపు, సెక్షన్ 106 (1 అండ్ 2) రద్దు చేయాలంటూ శుక్రవారం అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు శంకర్, విశాఖ జిల్లా మోటారు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బి. జగన్, అధ్యక్షుడు శివ, కార్యదర్శి అప్పలరాజు సంయుక్త ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ రోడ్డు రవాణా డ్రైవర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పార్లమెంట్, అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి ఆయా సెక్షన్లు, చట్టాలు రద్దు చేయాలన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం డ్రైవర్లకు ఉరితాడు బిగించేలా గత ఏడాది డిసెంబర్ 21న చట్టాలు తీసుకువచ్చిందన్నారు. గతంలో ప్రమాదానికి డ్రైవర్ కారణమైతే గరిష్టంగా రెండేళ్ల శిక్ష ఉండేదని, ఇప్పుడు మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం ప్రకారం పదేళ్ల జైలు, రూ.7 లక్షల జరిమానా విధించేలా నిబంధనలు తయారు చేశారన్నారు. ఇప్పటి వరకు ప్రమాదాలు జరిగిన వెంటనే స్టేషన్ బెయిల్ తీసుకునే అవకాశం ఉండేదని, కొత్త చట్టంలోని నిబంధనల వల్ల బెయిల్ కోసం ఎదురు చూడాల్సి వస్తుందన్నారు.

ఎదురెదురుగా ఢీకొన్న పోలీసు వాహనాలు


బీఆర్‌టీఎస్‌లో ఢీకొన్న రెండు పోలీస్ వాహనాలు

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డులో సంజయ్‌గాంధీ కాలనీ వద్ద రెండు పోలీస్ వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరం నుంచి హనుమంతవాక మీదుగా శుక్రవారం సాయంత్రం బీఆర్‌టీఎస్ రోడ్డు మధ్య లైన్‌లో సింహాచలం వైపు ఓ పోలీస్ అధికారి వాహనం వెళ్తోంది. అదే రోడ్డులో సింహాచలం నుంచి హనుమంతవాక వైపు మరో పోలీస్ అధికారి ఉండే వాహనం వెళ్తోంది. ఈ రెండు వాహనాలు మితిమీరిన వేగంతో ప్రయాణించి సంజయ్‌గాంధీ కాలనీ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. అది మధ్య లైన్ కావడంతో ఇతర వాహనాలు రాకపోకలు జరగలేదు. దీంతో రెండు వాహనాల్లో ప్రయాణించే వారితో పాటు ఇతరులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. పోలీస్ వాహనాలే మితి మీరిన వేగంతో ప్రయాణించి ప్రమాదానికి గురి కావడంపై స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధురాలి మృతి


వృద్ధురాలి మృతదేహం

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ గుర్తు తెలియని వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుమారు 75 సంవత్సరాలు వయసు గల వృద్ధురాలు జీవీఎంసీ పదో వార్డు ఆదర్శనగర్ పరిసరాలలో కొన్నాళ్లుగా యాచన చేస్తుండేది. ఆమె గురువారం మధ్యాహ్నం యచన చేస్తూ స్పృహ కోల్పోయి రోడ్డుపై పడిపోయింది. దీంతో స్థానికులు అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఆమె మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. బంధువులు ఎవరైనా ఉంటే ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరుతున్నారు.